ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 16.03.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ రోజు ప్రారంభమయ్యాయి. ఉభయసభలను ఉద్దేశించి తన ప్రసంగాన్ని తెలుగు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రారంభించారు. అభివృద్ధిలో ప్రతి పౌరుడిని భాగస్వామిని చేసేలా ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించిందని గవర్నర్ అన్నారు
2. రాష్ట్ర తలసరి ఆదాయం 4 లక్షల 18 వేల రూపాయలకు చేరిందని, క్యూర్, ప్యూర్, రేర్ మోడల్స్ ద్వారా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని గవర్నర్ తెలిపారు.
3. అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు
4. రాష్ట్రంలో బీఆర్ఎస్ విఫలమైందని, కేవలం బీజేపీయే ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తోందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు
5. మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధుల విషయంలో సభను తప్పుదోవ పట్టించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వెల్లడించారు.

-----------------------------

**తెలంగాణ తల్లి’ విగ్రహావిష్కరణ**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు నేడు వైభవంగా ప్రారంభమయ్యాయి. అసెంబ్లీకి చేరుకున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సీఎం రేవంత్ రెడ్డి, ఇతర ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా

గవర్నర్ అసెంబ్లీ ఆవరణలో నూతనంగా ప్రతిష్టించిన 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, ఉభయ సభలను ఉద్దేశించి తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించి అందరినీ ఆకట్టుకున్నారు. శ్రమించే తత్వం గల తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ వార్షిక బడ్జెట్ ప్రతి పౌరుడిని అభివృద్ధిలో భాగస్వామిని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందజేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ప్రజాకేంద్రీకృత పాలన అందిస్తుందని గవర్నర్ స్పష్టం చేశారు.

డెస్క్

----------------------------------------

**శాసనసభ సమావేశాలు**

తెలంగాణ శాసనసభ సమావేశాలు ఇవాళ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగించారు. గవర్నర్ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభిస్తూ, శ్రమించే తత్వం గల శాంతికాముక తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పౌరుడిని అభివృద్ధిలో భాగస్వామిని చేసేలా ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించిందని, ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలను అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు. ప్రజాకేంద్రీకృత పాలనే తమ విధానమని పేర్కొన్న గవర్నర్, '2047 తెలంగాణ రైజింగ్' దిశగా అడుగులు వేస్తున్నామని వెల్లడించారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.99 శాతం ఉండటం గర్వకారణమని ఆయన కొనియాడారు. మొత్తంగా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన దిశానిర్దేశాన్ని గవర్నర్ తన ప్రసంగంలో వివరించారు.

**S/B - GOVERNOR**

డెస్క్

--------------------------------

**గవర్నర్ ప్రసంగం**

తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు విజన్-2047 రోడ్డు మ్యాప్ సిద్ధం చేశామని గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రకటించారు. రాష్ట్ర తలసరి ఆదాయం 4 లక్షల 18

వేల రూపాయలకు చేరిందని, క్యూర్, ప్యూర్, రేర్ మోడల్స్ ద్వారా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. 2031 నాటికి పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుతుందని అంచనా వేస్తూ, పరిపాలన సౌలభ్యం కోసం జీహెచ్ఎంసీని 3 కార్పొరేషన్లుగా, మెట్రో ప్రాంతాన్ని 4 కమిషనరేట్లుగా విభజించామని పేర్కొన్నారు. ముఖ్యంగా హైడ్రా ద్వారా 1వెయ్యి 045 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విడిపించి, సుమారు 60 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడామని గవర్నర్ చెప్పారు. కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులన్ని రాబోయే మూడేళ్లలో పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణను గ్లోబల్ హబ్ గా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

డెస్క్

-------------------------

**సీతక్క**

అసెంబ్లీ ఆవరణలో మంత్రి సీతక్క మీడియాతో చిట్‌చాట్ చేస్తూ బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీని లక్ష్యం చేసుకొంటే పెద్ద నాయకుడిని అవుతానని కేటీఆర్ భ్రమిస్తున్నారని, కేటీఆర్‌ను ఎవరూ గుర్తించడం లేదనన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే తట్టుకోలేకపోతున్నారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తమ ప్రభుత్వం ప్రతి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని, పథకాల చట్టబద్ధత గురించి కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదమని ఆమె అన్నారు.

**పీటీసీ – హైదరాబాద్**

----------------------------

**కేటీఆర్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామా రావు ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ లోని అమరవీరుల స్తూపం వద్ద భారీ నిరసన చేపట్టారు. బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించాలని, వాటికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ,

"రాహుల్ బంధు కాదు.. మాకు రైతుబంధు కావాలి" అంటూ నినాదాలు చేశారు. మహిళలకు మహాలక్ష్మి పథకం అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, పెన్షన్లు పెంచుతామని చెప్పి పేదల నడ్డి విరిచారని వారు మండిపడ్డారు. రైతులకు వెన్నుపోటు పొడిచి రాహుల్ గాంధీ కోసం వెయ్యి కోట్లు తరలిస్తున్నారని ఆరోపిస్తూ అసెంబ్లీ ముట్టడికి సిద్ధమయ్యారు.

**S/B - KTR**

**పీటీసీ - హైదరాబాద్**

-----------------------

**రైతు బంధు**

తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరానికి 6 వేల రూపాయల చొప్పున మొత్తం 9 వేల కోట్ల రూపాయల నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 22న సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆయిల్‌పామ్ కర్మాగారం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం మొదటి విడతగా 3 వేల 590 కోట్ల రూపాయలు విడుదల చేస్తారు. దీనివల్ల సుమారు 73 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. రెండో విడతగా మరో 20 రోజుల తర్వాత 2 వేల 650 కోట్ల రూపాయలు, ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడతగా 2 వేల 760 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

**డెస్క్**

------------------------

**ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ విఫలమైందని, కేవలం బీజేపీయే ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తోందని ఆయన చెప్పారు. రైతుల సమస్యలు, రైతు భరోసా, ఆరు గ్యారంటీల అమలుపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని వెల్లడించారు. గుజరాత్‌లోని సబర్మతి నది అభివృద్ధికి, తెలంగాణలోని మూసీ పునరుద్ధరణకు చాలా తేడా ఉందని, ఇక్కడ పేదల ఇళ్లను అక్రమంగా కూల్చుతున్నారని ఆయన మండిపడ్డారు.

**డెస్క్**

------------------------

**హరీశ్ రావు**

అసెంబ్లీలో ఆరు గ్యారంటీల అమలుపై ప్రైవేటు బిల్లు పెడతామని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ప్రకటించారు. మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధుల విషయంలో సభను తప్పుదోవ పట్టించిన సీఎం రేవంత్ రెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. డ్రగ్స్ సంస్కృతికి తమ పార్టీ వ్యతిరేకమని, కేటీఆర్‌కు అందులో ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు.

**డెస్క్**

----------------------------

**రాబందులు**

ఆసిఫాబాద్ జిల్లాలోని పెంచికలపేట మండలం నందిగామ శివారులోని ప్రాణహిత ఒడ్డున పావురాల గుట్టపై స్థావరాలను ఏర్పాటు చేసుకున్న రాబందుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు కాగజ్ నగర్ అటవీ డివిజన్ అధికారి అప్పయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

**బైట్ - అటవీ డివిజనల్ అధికారి అప్పయ్య**

**పీటీసీ – ఆసిఫాబాద్**

------------------------------

**కామారెడ్డి**

రేపటి ఆరోగ్యకరమైన భారత్ కోసం ఈరోజు అర్హులైన ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలని కామారెడ్డి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రోహిత్ అన్నారు. జాతీయ టీకాల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ.. టీకా అంటే కేవలం ఒక మందు కాదని.. అది మన ప్రాణాలకు ఒక రక్షణ కవచం లాంటిదని వివరించారు. వ్యాధి వచ్చిన

తర్వాత బాధపడటం కంటే.. రాకముందే టీకాతో అడ్డుకట్ట వేయడం మేలని సూచించారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయించి, వారి భవిష్యత్తును ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంచాలని తల్లిదండ్రులను కోరారు.

**పీటీసీ – కామారెడ్డి**

-----------------------

**రాజన్న సిరిసిల్ల**

పశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ సూచించారు. కలెక్టరేట్‌లో ఇందుకు సంబంధించిన ప్రచార రథాన్ని ఆమె ప్రారంభించారు. పశువుల ఆరోగ్యం దెబ్బతింటే రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుందని, అందుకే ముందస్తుగా టీకాలు వేయించాలని ఆమె కోరారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకా వేయాలని, ఇందుకోసం 26 బృందాలు వచ్చే నెల ఏప్రిల్ 9వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ టీకాలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

----------------------------